## క్లుప్తంగా

### కంటి వెలుగు శిబిరం విజయవంతం



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ ఆఫీసర్

శిరివెళ్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్యవైద్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. నంద్యాల ప్రాంతీయ ఆప్తాల్మిక్ అధికారి డాక్టర్ కృష్ణ మోహన్‌రెడ్డి వృద్ధులకు పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఆపరేషన్లు చేసి అద్దాలు అందజేస్తామని డాక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయకుమార్, కావ్య, సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

### మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఉపాధి కూలీలు

ఉయ్యాలవాడ: నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని ఉపాధి ఏపీఓ రవిప్రకాష్ అన్నారు. మంగళవారం కాకరవాడ –పుచ్చకాయలపల్లె, కాకరవాడ – ఒంటెద్దుపల్లె రహదారులకు ఇరువైపులా, దిబ్బారెడ్డి, నాగమురళీధర్‌రెడ్డి పొలాల గట్లపై 738 మొక్కలు నాటారు. వాటి సంరక్షణ బాధ్యతను ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లకు అప్పగించినట్లు ఏపీఓ తెలిపారు.

### డాక్టరేట్ ప్రదానం



ఇస్మాయిల్

ఆళ్లగడ్డ: రుద్రవరం మండలం ఆలమూరు గ్రామానికి చెందిన కాకరవాడ ఇస్మాయిల్‌కు అనంతపురం జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో 'మెకానికల్ అండ్ మిషన బిలిటి బిహేవియర్ ఆఫ్ ఏ356 – కాంపోజిట్స్' అంశంపై చేసిన పరిశోధనకు గానూ యూనివర్సిటీ తనకు డాక్టరేట్ అందజేసిందని ఇస్మాయిల్ మంగళవారం తెలిపారు.

### ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న చైర్ పర్సన్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు ఎప్పటికప్పుడే పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా వీఆర్‌ఓలకు సూచించారు. మంగళవారం స్థానిక కార్యాయంలో వీఆర్‌ఓలతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ సప్లైరీ సర్వే నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రజలు పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరగకుండా స్పందనలో వస్తున్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### రైతులను లాభసాటిగా నడిపించాలి

గోస్పాడు: వ్యవసాయ విద్యార్థులు రైతులకు వ్యవసాయంలో కొత్త విషయాలను తెలియజేసి వారిని లాభసాటిగా నడిపించేలా చూడాలని మహానంది వ్యవసాయ కళాశాల డీన్ శివశంకర్‌నాయక్, ఏపీజీబీ బ్యాంక్ మేనేజర్ నారాయణరెడ్డి సూచించారు. మండలంలోని దీబగుంట్ల గ్రామంలో మంగళవారం వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవ అలవర్చుకోవాలన్నారు. గ్రామ వివరాలు, సమస్యలు, సాంఘిక, ఆర్థిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ప్రొఫెసర్లు శ్రీనివాసరెడ్డి, విజయభాస్కర్, గీతా శిరీష, దివ్య, యశ్వంత్ వీఆర్‌ఓ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ఈద్ కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న హబీబుల్లా

నంద్యాల(అర్బన్): రాయల్ స్కూల్ యజమాన్యం, నారాయణ స్కూల్ ఆధ్వర్యంలో డాక్టర్ యాకూబ్, ఇసాక్‌వలిల పర్యవేక్షణలో పేద ముస్లిం కుటుంబాలకు జకాత్ రూపంలో 500 ఈద్ కిట్లను పంపిణీ చేశారు. నారాయణ స్కూల్ ఆవరణంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సంక్షేమ శాఖ సలహాదారు డీఎస్ హబీబుల్లా హాజరై కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధినేతలు సాయివాణి, హుసేన్‌బాషా పాల్గొన్నారు.

# కండలు కరిగినా ఉడకని కుండ

వేసవి వచ్చిందంటే మట్టి కుండలకు ఎనలేని డిమాండ్ ఉండేది. పేదోడి ఫ్రిజ్‌గా పేరొందిన ఈ కుండలు ఈ సీజన్‌లో ప్రతి ఇంటిలో, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో కనిపించేవి.ఎండిపోతున్న గొంతులకు మట్టి కుండల్లోని నీరు అమృతంతో సమానంగా ఉండేది. ఆధునిక ఎలక్ట్రికల్ యంత్రాలు, పరికరాలు, ప్లాస్టిక్ క్యాన్లు అందుబాటులోకి రావడంతో మట్టి కుండలకు ఆదరణ కరువై కుమ్మరుల బతుకులు మట్టిపాలవుతున్నాయి. తరతరాలుగా ఈ వృత్తినే నమ్ముకుని బతుకుతున్న కుమ్మరుల కుటుంబాల జీవనం కష్టంగా మారుతోంది. కొందరు ఇప్పటికే ఈ వృత్తిని వదిలేసి వేరే పనుల నిమిత్తం సుదూర ప్రాంతాలకు వలస పోయారు. ఈ వృత్తి తప్ప వేరే వృత్తి తెలియని వారు అక్కడక్కడా కొందరు కుండలు తయారు చేస్తూనే వచ్చినదాంతో పొట్టపోసుకుంటున్నారు.

– ఆళ్లగడ్డ



విక్రయించేందుకు రోడ్డు వెంట పేర్చిన కుండలు

- మట్టి కుండలకు తగ్గిపోతున్న ఆదరణ
- వేసవిలో కూల్ క్యాన్‌ల వైపు మొగ్గు చూపుతున్న ప్రజలు
- కులవృత్తిని వదులుకుంటున్న కుమ్మర్లు



కుండలు తయారు చేస్తున్న కుమ్మరి

డివిజన్ పరిధిలో కుండలు తయారు చేస్తూ జీవిస్తున్న కుటుంబాలు సుమారు 5,000 దాకా ఉన్నాయి. తరతరాలుగా కులవృత్తిగా వస్తున్న ఈ వృత్తినే నమ్ముకుని జీవితాలను కొనసాగిస్తున్నారు. పట్టణంలోని కుమ్మరి కొట్టాలతో పాటు మండల కేంద్రం రుద్రవరం, చిత్రేనిపల్లె, ఓబులంపల్లి, చాగలమర్రి, శిరివెళ్ల మండలాల్లో కుమ్మర్లు అధికంగా నివసించేవారు. కుమ్మరి వృత్తిని నమ్ముకుని మట్టితో రకరకాల వస్తువులు తయారు చేసి విక్రయించేవారు. వీరు తయారు చేసే కుండలకు ప్రస్తుతం ఆదరణ తగ్గింది. తెల్లవారుజాము నుంచి ఇంటిల్లిపాది కష్టపడినా రోజుకు రూ.500 రావడంలేదు. కుండలు, ప్రమిదలు, మూకట్లతో పాటు రకరకాల వస్తువులను తయారు చేస్తుంటారు. తయారుచేసిన వస్తువులను ఒకచోట పెట్టి కట్టెలతో రంగు వచ్చే వరకు కాల్చుతారు. ఇంత కష్టంతో తయారు చేసిన ఒక్కో కుండకు రూ.10 కూడా మిగలడంలేదు. ఇద్దరు కలిసి కష్ట పడితే రోజుకు 25 నుంచి 50 కుండలు తయారు చేస్తారు. దీంతో 50 కుండలు అమ్ముకున్నా వీరికి రూ. 500లు మాత్రమే వస్తుంది. ఇందులో పగిలి పోయేవి, రంధ్రాలు పడేవి కొన్ని ఉంటాయి. దీంతో ఈ వృత్తి కన్నా ఇద్దరు కూలి పనికి పోతే రోజుకు రూ.600 నుంచి రూ.1,000 వరకు సంపాదించుకోవచ్చని కూలి పనికి పోతుండగా మరికొందరు వృత్తిని వదులుకోలేక అర్ధాకలితో జీవనం కొనసాగిస్తున్నారు.



కుండలకు మెరుగులు దిద్దుతున్న కుమ్మరి

**కుండలకు తగ్గిన ఆదరణ**

ఒకప్పుడు కుమ్మరి లేని గ్రామం ఉండేదికాదు. వీరు ఏడాది పొడవునా ఇంట్లోకి కావాల్సిన పాత్రలన్నీ మట్టితో తయారు చేసి ఇచ్చేవారు. పెళ్లిళ్లు, శుభకార్యాల సమయంలో మట్టి కుండలకు ప్రత్యేక స్థానం ఉండేది. ప్రస్తుతం అమ్మవారికి బోనాల కోసం ఇతర్రా మొక్కుబడులు చెల్లించుకునేందుకు మాత్రమే వీటిని ఉపయోగిస్తున్నారు. పూర్వం ఎంత కుండ తీసుకెళ్తే ఆ కుండెడు ధాన్యం ఇచ్చేవారని నానుడి. ఆధునిక కాలంలో లోహపు పాత్రలు వచ్చిన తరువాత వంట చేసుకునేందుకు మట్టి పాత్రలు కొనేవారు కరువయ్యారు. దీంతో మట్టి కుండలను కేవలం నీరు నిల్వ ఉంచుకుని తాగేందుకు బాణలు, కూజాలుగా మాత్రమే ఉపయోగించుకునేవారు. ఇప్పుడు ఫ్రిజ్‌లు, కూల్ ప్లాస్టిక్ క్యాన్‌లు, ప్లాస్టిల్ బిందెలు రావడంతో వీటిని కూడా కొనేవారు కరువయ్యారు.

**చలివేంద్రాల్లోనూ ప్లాస్టిక్ క్యాన్‌లే..**

ఎండాకాలం మొదలైందంటే చాలు పల్లెలు, పట్టణాల్లో ప్రధాన రహదారుల వెంట చలివేంద్రాలు ఏర్పాటు చేసి పెద్దపెద్ద మట్టి కుండలు పెట్టి చల్లని నీరు పోసి దాహార్తి తీర్చేవారు. ఇప్పుడు కుండల స్థానంలో కూల్ క్యాన్‌లు, వాటర్ ఫ్రిజ్‌లు పెట్టి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

### కుండలు కొనేవారు లేరు



గతంలో ఎండాకాలం వచ్చిందంటే ప్రతి ఒక్కరు చల్లనీరు తాగేందుకు కొత్త కుండలు కొనుక్కొనేవారు. ఇప్పుడు అందరూ ఫ్రిజ్‌లలో బాటిళ్లు పెట్టుకుంటున్నారు. ఆఫీసులలో కూల్ క్యాన్‌లు దించుకుంటున్నారు. దీంతో కుండలు కొనేవారేలేరు. గతంలో ఈ మూడు నెలలు ఎండాకాలం సీజన్‌లో రోజుకు 100 కుండలు దాక అమ్ముడు పోయేవి. ఇప్పుడు రోజుకు రెండు మూడు కుండలు కూడా అమ్ముడు పోవడంలేదు. చిన్నప్పటి నుంచి ఈ వృత్తి తప్ప వేరే పనిరాదు. అందుకే మా ఊరులో ఈ పనిలేక ఆళ్లగడ్డకు వచ్చి కుండకు రూ.10 లెక్కన కూలి పనిచేస్తున్నా. – పెద్దక్క, కుమ్మరికొట్టాల

### మట్టి ధర కూడా రావడంలేదు



పూర్వం కుండలు చేసుకునేందుకు మట్టి ఎక్కడైతే బాగుంటుందో అక్కడికి వెళ్లి కావాల్సినంత మట్టి ఉచితంగా తవ్వుకొని తెచ్చుకునేవాళ్లం. కర్రలు, పొట్టు కూడా ఊరికే దొరికేవి. ఇప్పుడు మట్టి ఒక్కో ట్రిప్పు రూ.3,500, కర్రలు రూ.3,000, పొట్టు రూ.1,000 పెట్టి కొనుగోలు చేసి, నలుగురు వ్యక్తులం వారం రోజులు పనిచేస్తే 100 కుండల వరకు తయారవుతాయి. కుండ రూ.100 అమ్మినా రూ.10 వేలు మాత్రమే వస్తాయి. కూలి కూడా గిట్టుబాటు కాదు. – సుబ్బరాయుడు, ఆళ్లగడ్డ

### మొక్క జొన్న పంట దగ్ధం

రుద్రవరం: మండల పరిధిలోని హరినగరం వద్ద రైతు మేకల చిన్నరామన్న సాగు చేసిన మొక్క జొన్న పంట మంగళవారం అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యింది. బాధిత రైతు తెలిపిన వివరాలు.. రబీ సీజన్లో తనకున్న ఒకటిన్నర ఎకరం పొలంలో రూ.45 వేలు ఖర్చు చేసి మొక్క జొన్న పంట సాగు చేశాడు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. గాలి పెద్దగా వీచడంతో పొలం పై భాగాన ఉన్న విద్యుత్ తీగల రాపిడికి నిప్పు రవ్వలు పడి మంటలు చెలరేగాయి. ప్రమాదంలో పంట అంతా కాలి బూడిద అయ్యిందని రైతు వాపోయాడు.

### ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్'

శిరివెళ్ల: మండలంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా సాగుతోంది. మంగళవారం గోవిందపల్లెలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, ఉప సర్పంచు శేషారెడ్డి, బోయలకుంట్లలో సర్పంచు జింకల నాగన్న, యర్రగుంట్లలో సర్పంచు సుభహాన్, ఉప సర్పంచు ప్రతాపరెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, గుంప్రమాన్‌దిన్నెలో మాజీ సర్పంచు నరసింహారెడ్డి, కోటపాడులో ఆర్యవైశ్య సంఘం నాయకుడు వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి, సర్పంచు ఉశేనిబీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాలనపై ఆరా తీసి స్టిక్కర్లు అతికించారు.

దొర్నిపాడు: మండలంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం అట్టహాసంగా కొనసాగుతోంది. మంగళవారం గుండుపాపల, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె గ్రామాల్లో ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు సేకరించారు. డోర్, ఫోన్‌లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో ఉన్న స్టిక్కర్లు అతికించారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల మధ్య తేడాను వివరించారు. కార్యక్రమంలో దొర్నిపాడు సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీపతి ప్రసాద్, శ్రీలక్ష్మి, జక్కుల రాముడు, నాగేష్, హుసేన్‌బాషా, వాసు, లక్ష్మీ ప్రభావతి మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ భూమా శ్రీనివాసరెడ్డి, భూమా రామకృష్ణారెడ్డి, మోహన్‌నాయుడు, బోయిన శ్రీనివాసులు మైనుద్దీన్ పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు




మాట్లాడుతున్న ఓబులేశు

నంద్యాల(అర్బన్): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరముందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేశు తెలిపారు. కార్మిక గర్జనగా మేడేను వాడవాడలా నిర్వహించుకుందామన్నారు. స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలోనూ, పని భద్రత విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పరోక్ష ఆదాయాలు పొందుతోందని విమర్శించారు. కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడితే ఫలితాలు అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రఘురామ్మూర్తి, సుంకయ్య, రమేష్‌బాబు, లక్ష్మీనారాయణ, సుగుణమ్మ, అబ్బాస్, శ్రీనివాసులు, సుజాత, బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి ఉండకూడదు



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ

ఆళ్లగడ్డ: ఎండలు ముదురుతున్న సందర్భంగా నీటి ఎద్దడి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని మండలంలోని ఏ గ్రామంలో కూడా నీటిఎద్దడి సమస్యలు రాకుండా పక్కా ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని ఎంపీపీ వీరభద్రుడు అన్నారు. మండల కేంద్రం చాగలమర్రి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులను సమన్వయం చేసుకుంటూ మంచి నీటి సరఫరా బోర్లు, స్పాట్ డెలివరీ ట్యాంకులు, కుళాయిలు పరిశీలించి మరమ్మతులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్, ఏఈ జగ్గయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

- నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(రూరల్): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని బిళ్లలాపురం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు 90 శాతం అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారన్నారు. అలాంటి నాయకుడిని మరోసారి దీవించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ సిద్దం శివారం, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్, సర్పంచ్ రమణమ్మ, ఎంపీటీసీ రామలక్ష్మమ్మ, నాయకులు శంకర్‌రెడ్డి, శ్రీరాములు, మద్దిలేటి, వెంకటసుబ్బయ్య, చిన్న రామక్రిష్టారెడ్డి, పెద్ద రామక్రిష్టారెడ్డి, శివారంరెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

# మహిళలకు భద్రత కల్పించాలి




మాట్లాడుతున్న దుర్గాభవానీ

నంద్యాల(అర్బన్): నూతన చట్టాలను తెచ్చి మహిళలకు భద్రత కల్పించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవానీ కోరారు. స్థానిక నిశాంతి భవన్‌లో ఏర్పాటు చేసిన సమాఖ్య జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాఖ్య 1936లో ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి దేశంలోని మహిళా హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తూ వస్తోందన్నారు. సమావేశంలో నాయకులు రామాంజనేయులు, రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్, సుంకయ్య, సోమన్న, భాస్కర్, సుబ్బరాయుడు, సుగుణమ్మ, నారాయణమ్మ, లక్ష్మీదేవమ్మ, స్వాతి, హసీనా, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# మోసపూరిత మాటలు నమ్మొద్దు





ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి చేతుల మీదుగా మెగా చెక్కు అందుకుంటున్న మహిళలు, వేడుకల్లో పాల్గొన్న మహిళలు

- సంక్షేమ పథకాలు అందించే ప్రభుత్వానికే పట్టం కడదాం
- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

రుద్రవరం: ఎన్నికలు సమీపించే కొద్దీ వివిధ పార్టీల నేతలు మోసపూరిత మాటలు చెబుతారని, అలాంటి వారిని నమ్మకుండా సంక్షేమ పథకాలు అందించే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే మరోసారి పట్టం కడదామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. రుద్రవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది ఏర్పాటు చేసిన మూడో విడత ఆసరా వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళలకు రూ.4.59 కోట్ల మెగా చెక్కును అందజేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పొదుపు మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడదల వారిగా వారి ఖాతాలో నగదు జమ చేస్తున్నారన్నారు. అలాగే మహిళ ఆర్థికాభివృద్ధికి కృషి పలు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా పాలన సాగిస్తున్న జగనన్నకు వచ్చే ఎన్నికల్లో అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, పుట్టాలమ్మ క్షేత్రం డైరెక్టర్ గంగిశెట్టి తిమ్మయ్య, జెడ్పీటీసీ సభ్యులు మాధవి, ఎంపీపీ బాలస్వామి, సింగిల్ విండో చైర్మన్ నాగేశ్వరరెడ్డి, పశువైద్య సహాయ సంచాలకులు గిడ్డయ్య, డీపీఎం దానం, ఎంపీడీఓ మధుసూదనరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జాకీర్, బైరి శంకర్, తిరుపతిరెడ్డి, మహేష్ రెడ్డి, హరినారాయణ, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే

శిరివెళ్ల: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంగళవారం వీరారెడ్డిపల్లెలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హులై ఉండి సంక్షేమ పథకలు అందని వారు వలంటీర్లకు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. పథకాల మంజూరు, అమలులో అవినీతికి తావులేకుండా లబ్ధిదారుల ఖాతాలకే నగదు జమ చేశామన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల సిఫార్సు ఉంటేనే పథకాలు మంజూరయ్యేవని గుర్తు చేశారు. కొత్తగా ఏర్పడిన వీరారెడ్డిపల్లె పంచాయతీకి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచు మందాల శివారెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షురాలు రాధిక, ఉప సర్పంచు వినోద్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ నాయక్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, హిస్టరీ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ హఫీజ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి తదితరులు పాల్గొన్నారు.

# పూలే అడుగుజాడల్లో నడుద్దాం





ఆర్టీసీ డిపోలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు,నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నంద్యాల(అర్బన్)/(వ్యవసాయం): సామాజిక న్యాయం కోసం పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో నడుద్దామని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన జయంతిని పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పద్మావతినగర్ ఆర్చి వద్ద ఉన్న పూలే విగ్రహానికి ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, అధికార ప్రతినిధి ఊకొట్టు వాసు, ట్రెజరర్ ఎస్‌వైడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- నంద్యాల ఆర్టీసీ డిపోలో జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు, డిపో మేనేజర్ గంగాధర్ రావు, అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు, అసోసియేషన్ నాయకులు పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లాలుస్వామి, ప్రజా సంఘాల నాయకులు పులికొండన్న, రాజునాయుడు, శివకృష్ణయాదవ్, రవీంద్రనాథ్, సురేష్ బాబు, రాజేష్, బాలచంద్రుడు, రవీంద్రనాయక్, రమణయ్యగౌడ్ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- బీసీ సంఘం నేతలు వేణుగోపాల్, సత్యం, అబ్దుల్, బాలచంద్రుడు, నాగేంద్రప్ప, తదితరుల ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఉయ్యాలవాడ మోడల్ స్కూల్‌లో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



పూలే చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

**ఉయ్యాలవాడలో..**

ఉయ్యాలవాడ: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. మంగళవారం పూలే జయంతి సందర్భంగా స్థానిక మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నూర్జహాన్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రఫీ, ఏపీఓ రవిప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

**దొర్నిపాడులో**



దొర్నిపాడులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

దొర్నిపాడు: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని ఎంపీడీఓ నాగఅనసూయ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నవసమాజ నిర్మాణానికి ఆయన ఎంతో కృషి చేశారని భవిష్యత్ తరాలకు ఆయన జీవితం ఆదర్శమని కొనియాడారు.